క్లుప్తంగా

అథ్లెటిక్ మీట్‌కు విద్యార్థుల ఎంపిక



సౌత్ జోన్ అథ్లెటిక్ మీట్‌కు ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు వి.మనీష, టి.హారిక సౌత్ జోన్ స్టేట్ అథ్లెటిక్ మీట్‌కు ఎంపికయ్యారు. ఆగస్టు 9 నుంచి 11వ తేదీ వరకు సౌత్ జోన్ అథ్లెటిక్ మీట్ చీరాలలో నిర్వహించనున్నారు. మనీష అండర్–16 విభాగంలో హర్డిల్స్‌కు, టి.హారిక జావిలిన్ త్రో విభాగానికి ఎంపికయ్యారు. ఈ మేరకు స్కూల్ హెచ్‌ఎం పైడి వెంకటరావు సోమవారం తెలిపారు. శ్రీకాకుళంలో ఆదివారం జరిగిన పోటీల్లో మనీష, వినీల ప్రతిభ చాటారు. వీరిని పీడీలు రమణ, గణపతి, ఉపాధ్యాయుడు సాయి శ్రీనివాస్, తదితరులు అభినందించారు.

సబ్‌జైల్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న సివిల్ జడ్జి వాణి

నరసన్నపేట: స్థానిక సబ్‌జైల్‌ను జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాణి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైల్ పరిసరాలను పరిశీలించారు. జైల్లో రిమాండ్ ఖైదీలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు భోజన సదుపాయాలు అందుతున్నాయా అని ప్రశ్నించి తెలుసుకున్నారు. 11 మంది రిమాండ్ ఖైదీలుంటే.. ఒక్కొక్కరితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. న్యాయసహాయం ఉచితంగా కావాలంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. జైల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్‌గా శంకరరావు



హిరమండలం: మండల వెలమ వెల్ఫేర్ అసోసియేషన్ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్‌గా దుర్బలాపురం గ్రామానికి చెందిన అల్లు శంకరరావు ఎంపికయ్యారు. కార్యదర్శిగా కొండరాగోలు గ్రామానికి చెందిన యాళ్ల నాగేశ్వరరావు, ట్రెజరర్‌గా అంబావల్లి గ్రామానికి చెందిన పాదిలాపు శ్రీరాములు ఎంపికయ్యారు. వీరి ఎంపికపై వెలమ సామాజిక వర్గానికి చెందిన పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు సోమవారం అభినందనలు తెలియజేశారు.


ఆవు దూడపై కుక్కల దాడి



గాయపడిన దూడను చూపుతున్న రైతు

పొందూరు: మండలంలోని రాపాక గ్రామానికి చెందిన కొంచాడ సూర్యనారాయణకు చెందిన పశువుల శాలలో ఉన్న ఆవు దూడపై కుక్కల గుంపు దాడికి పాల్పడింది. ఈ సంఘటన సోమవారం చోటు చేసుకుంది. సమీపంలో ఉన్న వ్యక్తి కేకలు వేయడంతో కుక్కలు పారిపోయాయని, ఆవు దూడ గాయాలతో బయటపడిందని రైతు సూర్యనారాయణ తెలిపారు.

పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



కమిటీ సభ్యులతో రాడ విజయ్‌కుమార్, డాక్టర్ జార్జి ముల్లర్

ఆమదాలవలస: మండల, మున్సిపాలిటీ పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీని ఆమదాలవలస పట్టణంలోని వెంగళరావు కాలనీలో గల క్రీస్తు సంఘం చర్చిలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక నియోజకవర్గ పెద్దలు రాడ విజయ్ కుమార్, డాక్టర్ జార్జి ముల్లర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ.. కమిటీ సభ్యులు బాధ్యతతో పనిచేసి సంఘానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. మండల, మున్సిపల్ ప్రెసిడెంట్‌గా స్టీఫెన్, ప్రధాన కార్యదర్శిగా ఆర్.శ్యామ్, కోశాధికారిగా పి.విజయ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా షద్రక్ బాబు, సహా కార్యదర్శిగా డి.దుర్గాప్రసాద్, ఉప కోశాధికారిగా పాస్టర్ యు.డేవిడ్‌ను ఎన్నుకున్నారు. నూతన కమిటీకి పలువురు అభినందనలు తెలిపారు.

వితరణ

జలుమూరు: శ్రీముఖలింగం గ్రామానికి చెందిన నాయుడుగారి రాజశేఖర్ అదే గ్రామానికి చెందిన దివ్యాంగుడు శ్రీనుకు సోమవారం కూలర్ వితరణ చేశారు. నాయుడుగారి ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నామని రాజశేఖర్ తెలిపారు. ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు శైలజ, తదితరులు పాల్గొన్నారు.

చెరువులు కనుమరుగు



ఆక్రమణలో ఉన్న బుడ్డివలస సొండివాని చెరువు

- పొలాలుగా మారుతున్న వైనం
- వరదల సమయంలో ముంపు బారిన పంట పొలాలు
- ఆక్రమణలకు అడ్డులేదు..

సరుబుజ్జిలి: ఆక్రమణదారుల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండాపోతుంది. ప్రభుత్వ ఆస్తులకు నష్టం వాటిల్లుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో కబ్జారాయుళ్లు రెచ్చిపోయి మరీ దురాక్రమణలకు పాల్పడుతున్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, ఆమదాలవలస, బూర్జ, పొందూరు మండలాల్లో సుమారు 580 సాగునీటి చెరువులున్నాయి. వీటి విస్తీర్ణం దాదాపు 3,500 ఎకరాల్లో విస్తరించి ఉంది. వీటి పరిధిలో సుమారు 11 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలి. ప్రతి ఏటా గ్రామాల్లో అక్రమార్కులు చెరువులను చెరపట్టడం వలన వాటి స్వరూపాలు కోల్పోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో భౌగోళిక చిత్రపటాల్లో సాగు భూములుగా దర్శనమిస్తున్నాయి. దాదాపుగా నియోజకవర్గంలో 465 ఎకరాలు (చెరువు గర్భాలు) ఆక్రమణదారులు గుప్పెట్లో ఉన్నాయి.



పొలాలుగా మారిన ముంగెన్న చెరువు

ఆక్రమణకు గురైన చెరువులు..

సరుబుజ్జిలి మండలంలోని మతలబుపేట కర్ర చెరువు, నందికొండ శిమ్మ కోనేరు, శరభాపురం చెరువు, పాలవలస, రావివలస పెద్దచెరువు, కొండవలసలో సైలాడ, రొట్టవలసలో ముంగెన్న చెరువు, వీరభద్రాపురం అచ్చెన్న చెరువు, కొత్తకోటలో మినీ రిజర్వాయర్‌గా పిలవబడే పెద్ద చెరువు, బుడ్డివలస సొండివాని చెరువులు ఆక్రమణదారుల చెరలో ఉన్నాయి. ఆమదాలవలస మండలంలోని పాలచెరువు, పెద్ద చెరువులు కబ్జాకు గురయ్యాయి.

గుట్టుగా ఆక్రమణ..

ముందుగా చెరువులను మట్టితో చదును చేసి వాణిజ్య పంటలు కొద్దిరోజులపాటు పండిస్తున్నారు. అనంతరం చెరువును చదును చేసి గట్లువేసి పొలాలుగా మార్చుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఆక్రమించిన చెరువులను అనధికారికంగా విక్రయాలు కూడా చేస్తున్నట్లు సమాచారం. దీనివలన చెరువు గర్భం కుచించుకుపోయి వరదలు వచ్చే సమయంలో పొలాల మీదుగా నీరు ప్రవహిస్తుంది.

ఆమదాలవలస నియోజకవర్గంలో చెరువులు, ఆక్రమణకు గురైన విస్తీర్ణం (ఎకరాల్లో) వివరాలు ఇలా..

మండలం	సరుబుజ్జిలి	ఆమదాలవలస	బూర్జ	పొందూరు
చెరువులు	110	190	120	160
ఆక్రమణకు గురైన విస్తీర్ణం	145	121	100	109

ఆక్రమించినా పట్టించుకోలేదు



కొత్తకోట గ్రామంలోని పెద్దచెరువులో సుమారు 30 ఎకరాల వరకు ఆక్రమణదారుల చెరలో ఉన్నాయి. చెరువు గర్భాన్ని పొలాలుగా మార్చి పంటలు పండిస్తున్నారు. పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. దీనివలన ఆక్రమణదారుల హవా కొనసాగుతోంది.

– సురవరపు నాగేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు, సరుబుజ్జిలి

సాగునీరు అందడం లేదు..



అధిక శాతం గ్రామాల్లో చెరువులపై ఆధారపడి రైతులు పంటలు పండిస్తున్నారు. చెరువులను ఆక్రమించడం వలన సాగునీటికి కష్టాలు తప్పడంలేదు. ఉపాధి పనులు చేసే సమయంలో కూడా అధికారులు ఆక్రమణలు తొలగించడం లేదు. భవిష్యత్‌లో గ్రామ చిత్రపటాల నుంచి చెరువులు మాయం కాక తప్పదు.

– పున్నపురెడ్డి తవిటినాయుడు, రైతు, మఠిపాడు, సరుబుజ్జిలి మండలం

చర్యలు తీసుకుంటాం

చెరువు గర్భాలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణ చట్టరీత్యా నేరం. ఆక్రమణలను వీఆర్వోల ద్వారా గుర్తిస్తాం. కబ్జాదారులకు నోటీసులు జారీచేసి చర్యలు తీసుకుంటాం.

–ఎల్.మధుసూదన, తహసీల్దార్, సరుబుజ్జిలి

వాలీబాల్ క్రీడాకారునికి అభినందన

నరసన్నపేట/పోలాకి: థాయ్‌లాండ్‌లో ఇటీవల జరిగిన ఆసియా అండర్– 16 వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో భారత జట్టు తరపున పాల్గొని సత్తాచాటిన జిల్లాకు చెందిన క్రీడాకారుడు అట్టాడ చరణ్‌కు మాజీ డిప్యూటీ సీఎం, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అభినందించారు. సోమవారం మబగాం వచ్చిన చరణ్‌ను అసోసియేషన్ తరపున రూ.10 వేల చెక్ అందజేసి సత్కరించారు. ఆ పోటీల్లో భారత జట్టు మూడో స్థానంలో నిలిచింది. వరల్డ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే జట్టుకు చరణ్ ఎంపికైన విషయం విదితమే. చరణ్‌ను చూస్తుంటే తన యుక్త వయసు గుర్తుకు వస్తుందని కృష్ణదాస్ అన్నారు. ఇదే వయసులో తానూ వాలాబాల్ పోటీల్లో పాల్గొన్నాని గుర్తు చేసుకున్నారు. వాలీబాల్ పోటీల్లో జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రతినిధులు, పలువురు పీడీలు పాల్గొన్నారు.



చరణ్‌ను సత్కరించి, రూ.10 వేల చెక్‌ను అందజేస్తున్న ధర్మాన కృష్ణదాస్

పరామర్శ..

నరసన్నపేట: స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచ్ బూరల్లి శంకర్ సోదరుడు ప్రసాద్ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ సోమవారం పరామర్శించారు. ప్రసాద్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మృతి గల కారణాలను సర్పంచ్ శంకర్‌ను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, నరసన్నపేటకు చెందిన పార్టీ నాయకులు పాల్గొన్నారు.



నరసన్నపేట: ప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ధర్మాన కృష్ణదాస్, నాయకులు

డీఎస్పీ కుటుంబానికి..

పోలాకి: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన డీఎస్పీ (ఇంటిలిజెన్స్) జల్లు శాంతారావు కుటుంబానికి మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు సోమవారం డోల గ్రామంలో పరామర్శించారు. రైతు కుటుంబం నుంచి క్రమశిక్షణతో ఉన్నతాధికారిగా ఎదిగిన శాంతారావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందటం బాధాకరమన్నారు. ఈ ప్రాంతం నుంచి మంచి ఉన్నతాధికారిని కోల్పోయామన్నారు. డీఎస్పీ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, కణితి కృష్ణారావు, చింతు రాఘవరావు, అంబటి శ్రీను తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు..

ఆమదాలవలస: మండలంలోని గాజులకొల్లివలస పంచాయతీ కామిరెడ్డిపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కామిరెడ్డి రమణ ఇటీవల పాము కాటుకు గురయ్యారు. చికిత్స పొంది ఇంటికి సోమవారం వచ్చారు. రమణను వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పార్టీ పంచాయతీరాజ్ వింగ్ కార్యదర్శి మొండేటి కూర్మారావు, పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

బూర్జ మండలంలో..

బూర్జ: మండలంలోని వావాం గ్రామానికి కె.చంద్రకుమారి, వి.మణికంఠ, నీలాదేవిపురం (నీలంపేట) గ్రామానికి చెందిన పి.నారాయణమ్మ, ఆయి లక్ష్మీబాయి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాలను ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ పరామర్శించారు. బూర్జ గ్రామానికి చెందిన పి.హేమలత, పి.వెంకటరమణ, మదనాపురం గ్రామానికి చెందిన సింహాద్రి వరలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతున్నారు. వారిని పరామర్శించి వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, జల్లు ఆదినారాయణ, తొత్తడి సురేష్, చొక్కర కృష్ణ మోహన్, ఏగు రాజారావు, మజ్జి నర్సింగరావు, పార్టీ మండల కార్యదర్శి సాకేటి శ్రీనివాసరావు, పి.రమేష్ ఉన్నారు.



పోలాకి: శాంతారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ధర్మాన ప్రసాదరావు



ఆమదాలవలస: కామిరెడ్డి రమణను పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

నరసన్నపేట: నియోజకవర్గ కేంద్రంలో 25 ఏళ్ల క్రితం ఏర్పడిన లయన్స్ క్లబ్ ద్వారా అందజేస్తున్న సేవలు బాగున్నాయని, మరింతగా సేవలు విస్తరించాలని క్లబ్ ఉత్తరాంధ్ర సీనియర్ ప్రతినిధులు డి.వి.వి.ఎస్.వర్మ, వి.ఎం.రావు, వి.సుబ్బరాజు అన్నారు. సోమవారం నరసన్నపేట మిలీనియం లైన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. చేపట్టాల్సిన సేవలను వివరించారు. కొత్తగా 20 మంది సభ్యులను చేర్చడం జిల్లాలో ఇదే ప్రథమమని కొనియాడారు. నూతన కార్యవర్గం మరింత బాధ్యతగా పనిచేయాలన్నారు. కార్యవర్గ అధ్యక్షునిగా తంగుడు రత్న కుమార్, కార్యదర్శిగా పాట్నూరు రమేష్, ట్రెజరర్‌గా కాశిన రమేష్ ప్రమాణ స్వీకారం చేశారు. క్లబ్ సభ్యులు ఊణ్ణ రంగనాథ్, ఉన్న సోమేశ్వరరావు, గొలివి మోహన్ రావు, సదాశివుని కృష్ణ, వి.నాగరాజు, వి.వి.ఎస్.ఎస్.మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

ప్రణాళికాబద్ధంగా బోధించాలి

హిరమండలం: పదో తరగతి విద్యార్థులకు ఇప్పటినుంచే ప్రణాళికబద్ధంగా బోధన నిర్వహించాలని ఎంఈఓ కె.రాంబాబు అన్నారు. మండలంలోని తంప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం తనిఖీ చేశారు. ఉదయం ప్రత్యేక తరగతులు, సాయంత్ర స్టడీ అవర్స్ విధిగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. హెచ్‌ఎం చెరుకూరి రమణ ఉన్నారు.

ప్రభుత్వ భూమిని పేదలకు పంపిణీ చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగరావు సింహాచలం

ఆమదాలవలస: కొండ ప్రాంతంలో ఉన్న (పోరంబోకు) భూములను పేదలకు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగరావు సింహాచలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని సైలాడ రెవెన్యూ పరిధిలోని సంగమయ్య కొండ ప్రాంతాన్ని స్థానిక యువకులతో కలిసి పరిశీలించారు. కొండ పోరంబోకు ఆక్రమణలకు గురవుతుందన్నారు. సర్వే నంబర్ 296లో కొంతమంది వ్యక్తులు గత టీడీపీ ప్రభుత్వం హయంలో తప్పుడు డీపట్టాలు సృష్టించారన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని సంగమయ్య కొండ చుట్టూ ఉన్న కొండ పోరంబోకును కాపాడాలన్నారు. గ్రామస్తులు నవిరి శ్రీనివాస్, పిన్నింటి యుగంధర్, మట్ట వసంత, తదితరులు పాల్గొన్నారు.



ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న సింహాచలం

న్యాయం చేయాలి..

జలుమూరు: తన సాగులో ఉన్న భూమిని కరకవలసకు చెందిన కంచి వరాలు, భాస్కరరావు ఆక్రమించుకొని ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అదే గ్రామానికి చెందిన పేడాడ పాపారావు ఆవేదన వ్యక్తం చేశారు. తాతల కాలం నాటి నుంచి అనుభవంలో ఉన్న భూమిని ఆక్రమించారని సోమవారం తెలిపారు. తరచూ వివాదాలు పెట్టి అవస్థలకు గురిచేస్తున్నారన్నారు. తనకు చెందిన స్థలంలో అరటి, ఇతర మొక్కలు వేశారని తెలిపారు. రెవెన్యూ అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. దీనిపై ఆర్ఐ కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించి, పూర్తి స్థాయిలో విచారణ చేస్తామని తెలిపారు.



ఆక్రమణ స్థలంలో వేసిన మొక్కలు

సంక్షిప్తంగా..

జాబ్ మేళాలో 162 మంది ఎంపిక



నియామక పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు, సాయికుమార్

పాతపట్నం: మండల కేంద్రంలోని మహేంద్ర డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాలో 12 కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. 162 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయి కుమార్ తెలిపారు. జాబ్ మేళాను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రారంభించారు. జాబ్ మేళాకు 365 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల్ ఆచార్యులు, కరస్పాండెంట్ ఎస్.మధుబాబు, తూలుగు తిరుపతిరావు, పైల బాబ్జి, సైలాడ సతీష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన

ఆమదాలవలస: పట్టణ శివార్లలోని సెయింట్‌అన్స్ పాఠశాలకు విద్యార్థులు ఆలస్యంగా వస్తున్నారని సోమవారం గేట్లు మూసివేశారు. పాఠశాల యాజమాన్యం తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులను ఆగ్రహానికి గురై గేటు వద్ద బైఠాయించారు. విద్యాశాఖ అధికారులకు విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. డిప్యూటీ ఈఓ విజయకుమారి, ఎంఈఓ రాజేంద్రప్రసాద్ పాఠశాల వద్దకు చేరుకున్నారు. వారు విలేకరులతో మాట్లాడుతూ.. తల్లిదండ్రులు ఆందోళన చెందడంలో అర్థం ఉందని, అలాగే పాఠశాల సమయాలను కూడా పాటించాలన్నారు. ఈ సంఘటనపై పాఠశాల యాజమాన్యానికి నోటీసులు అందజేశామని, మూడు రోజుల్లో సరైన సమాధానం ఇవ్వాలని పేర్కొన్నట్లు తెలిపారు.

తప్పిన ప్రమాదం

మెళియాపుట్టి: మండలంలోని చీపురుపల్లి వద్ద గేదెలు గుంపుగా రోడ్డుపైకి రావడంతో వాటిని తప్పించబోయి కారు అదుపు తప్పింది. అక్కడే ఉన్న ఖానాకు ఢీకొని నిలిచింది. ఈ ప్రమాదం సోమవారం సాయంత్రం జరిగింది. ఒడిశా రాష్ట్ర పర్లాకిమిడి నుంచి కారు చీపురుపల్లి వైపు వస్తుంది. కార్లో ఉన్న వ్యక్తులకు ఎటువంటి గాయాలు కాలేదు. కారు ముందు భాగం పాడైంది.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పాతపట్నం: ఈ నెల 30వ తేదీన పాతపట్నం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ మేరకు టెక్కలి విద్యుత్‌శాఖ ఈఈ జి.శంకరరావు సోమవారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ ఏరియా, సాయి నగర్ కాలనీ, దశరథపురం, తిడ్డిమి, రంకిణి, సూర్యనారాయణపురం, చంగుడి, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

చిన్నతరహా సాగునీటి పథకాల గణన

జలుమూరు: చిన్నతరహా సాగునీటి పథకాలు గణనతో వచ్చే ఖరీఫ్, రబీకి నీటి లభ్యతపై నివేదిక సిద్ధం చేయనున్నామని స్టాటికల్ అధికారి బి.సుధాకర్ అన్నారు. సోమవారం జలుమూరు తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. మండల పరిధిలోని మైనర్ ఇరిగేషన్ తోపాటు వ్యవసాయ బావులు, బోర్లును కూడా పరిగణనలోకి తీసుకుంటున్నామన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

హిరమండలం: మేజర్ పంచాయతీ హిరమండలంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురపు తేజేశ్వరరావు సోమవారం పర్యటించారు. స్థానిక మహిళలు ఆయనను కలిసి గత పదేళ్ల నుంచి ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. మేజర్ పంచాయతీ ఈఓ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారితో తేజేశ్వరరావు మాట్లాడారు. వీలైనంత త్వరగా తాగునీటి సమస్య పరిష్కరించాలని సూచించారు.

తనిఖీ..



ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్ఐ ప్రవల్లిక, ఎంపీపీ, జెడ్పీటీసీలు

బూర్జ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇటీవల గుర్తుతెలియని దొంగలు ప్రవేశించి ఇన్వర్టర్ బ్యాటరీలు రెండు, ఇన్వర్టర్‌ను అపహరించారు. సోమవారం స్థానిక ఎస్ఐ ఎం.ప్రవల్లిక, ఎంపీపీ కర్నేన దీప, జెడ్పీటీసీ బెజ్జిపురం రామారావు కార్యాలయాన్ని తనిఖీ చేశారు. తరచూ దొంగతనాలు జరిగి వస్తువులు పోతుండడంతో కారణాలు ఏమిటని సిబ్బందిని ప్రశ్నించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో దర్యాప్తు జరిపించాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసరావు, సర్పంచ్ ఏగు అనురాధ, పోలీస్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



హిరమండలం: తుంగపంపరలో కూటమి ప్రభుత్వ మోసాలను వివరిస్తున్న పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మెళియాపుట్టి: సుందరాడలో క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కొత్తూరు: కుంటిభద్ర కాలనీలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న ఎంపీపీ సావిత్రి, జెడ్పీటీసీ భాగ్యవతి, నాయకులు



నరసన్నపేట: మాకివలసలో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

‘దగాకోరు పాలనను నిలదీయండి’

ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్, అనేక హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా దగాకోరు పాలన చేస్తున్న కూటమి నాయకులను గ్రామాల్లో నిలదీయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. హిరమండలం మండలంలోని చిన్నకోరాడ, గొట్టా, చొర్లంగి, తుంగపంపర, అవలంగి, కల్లట గ్రామాల్లో, పాతపట్నం మండలంలోని పెద్దసీది, పాశీగంగుపేట, తామర, తీమర గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మెళియాపుట్టి మండలంలోని సుందరాడ, పద్ద గ్రామాల్లో పార్టీ మండల కన్వీనర్ పోలాకి జయమునిరావు ఆధ్వర్యంలో, కొత్తూరు మండలంలోని కుంటిభద్ర కాలనీ, మహార్తాపురం గ్రామాల్లో ఎంపీపీ సవర సావిత్రి, జెడ్పీటీసీ సభ్యురాలు కామక భాగ్యవతి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. నరసన్నపేట మండలంలోని మాకివలసలో ఎంపీపీ ఆరంగి మురళి ఆధ్వర్యంలో, జలుమూరు మండలంలోని కరవంజ, గుగ్గిలి గ్రామాల్లో ఎంపీపీ వాన గోపి, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, జిల్లా కార్యదర్శి మొజ్జాడ శ్యామలరావు ఆధ్వర్యంలో, సారవకోట మండలంలోని చీడిపూడి, అవలింగి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ మండల నాయకుల ఆధ్వర్యంలో, పోలాకి మండలంలోని ధీర్ఘాశి, గొల్లలవలస పంచాయతీల్లో మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి క్యూఆర్ కోడ్‌ను అందించి, కూటమి ప్రభుత్వ మోసాలను వివరించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



పాతపట్నం: పెద్దసీదిలో క్యూఆర్ కోడ్‌ను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



జలుమూరు: గుగ్గిలిలో క్యూఆర్ కోడ్‌ను అందజేస్తున్న ఎంపీపీ గోపి, నాయకులు



సారవకోట: చీడిపూడిలో క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పోలాకి: ధీర్ఘాశిలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు